

కొడకండ్ల : జాంకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## పలు కుటుంబాలకు ఎర్రబెల్లి పరామర్శ

దేవరుప్పుల, మే 15 : మండలంలోని పలు గ్రామాల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పెదమడూరులో ఆకవరం జనార్దన్ రెడ్డి(89) అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృతదేహంపై ఎర్రబెల్లి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. అదే గ్రామంలో బీఆర్‌ఎస్ నాయకుడు బొబ్బిలి సదానందం గుండెపోటుతో మృతి చెందగా ఆయన ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. భార్గవీ గార్డెన్‌లో మన్ పహాడ్ గ్రామానికి చెందిన మేడుదల కుమారస్వామి కూతుళ్ల నూతన వస్త్రాలంకరణ వేడుకలకు హాజరై చిన్నారులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి వెంట బీఆర్‌ఎస్ నాయకులు పల్లా సుందరరాంరడ్డి, ఏల సుందర్, జోగు సోమనర్సయ్య, నల్ల ఉమేశ్, అనంతోజు కృష్ణమూర్తి, వంగ అర్జున్, గడ్డం రాజు, శీల తిరుమలేశ్, బండారు రాములు, పానుగంటి గిరి, రవి ఉన్నారు.



పెదమడూరులో మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

**మొండ్రాయిలో..**

కొడకండ్ల : మండలంలోని మొండ్రాయి గ్రామ బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పాలెపు నాగయ్య సతీమణి ఊర్మిళకు కిడ్నీ సంబంధిత శస్త్ర చికిత్స జరిగింది. చికిత్స అనంతరం ఆమె తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటుంది. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం ఊర్మిళ ఇంటికి వెళ్లి ఆమెను పరామర్శించారు. అదేవిధంగా మండలంలోని రామేశ్వరం తండాకు చెందిన మాజీ సర్పంచ్ లాలూనాయక్ తల్లి మాలోత్ జాంకి ఇటీవల మృతి చెందింది. బాధిత కుటుంబాన్ని దయాకర్‌రావు పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి : సీఐ

జనగామ చౌరస్తా, మే 15 : జనగామ పట్టణ ప్రజలతోపాటు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని అర్బన్ సీఐ పీ దామోదర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తమ అవసరాల నిమిత్తం పట్టణంలోని వివిధ రకాల వస్త్ర, వ్యాపార, వాణిజ్యపరమైన వస్తువులు, పరికరాలు, సామగ్రి కొనుగోలు కోసం వచ్చే వినియోగదారులు తమ వాహనాలను సదరు దుకాణ సముదాయాల ఎదుట ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా పలు హోటల్స్, బ్యాంకులు, బట్టల దుకాణాలు, వైన్స్‌ల ఎదుట ఫోర్ వీలర్ వాహనాలను అడ్డదిడ్డంగా పార్కింగ్ చేయొద్దని ఆదేశించారు. రోడ్లపై ఇష్టారీతిన పలువురు వాహనదారులు తమ వాహనాలు పార్కింగ్ చేయడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా ఆ మార్గంలో వెళ్లే మిగతా వాహనాదారులతోపాటు ప్రజలు ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. ఆయా వ్యాపార సంస్థల నిర్వాహకులు తమ దుకాణాల ఎదుట నిర్దేశించిన పార్కింగ్ స్థలంలో వినియోగదారులు తమ వాహనాలను నిలిపి ఉంచే విధంగా చూడాలన్నారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సీఐ దామోదర్‌రెడ్డి హెచ్చరించారు.

## చెత్త తరలించిన పంచాయతీ సిబ్బంది

**'నమస్తే తెలంగాణ' ఎఫెక్ట్**

చిల్పూరు, మే 15 : మండలంలోని నష్కల్ గ్రామంలో చెత్తాచెదారం పేరుకుపోయి ప్రతి వాడలో పరిసరాలు అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. ఈ క్రమంలో గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో చెత్త సేకరణకు ఉపయోగించే ట్రాక్టర్ ట్రాలీ నిలిపి ఉండగా ప్రజలు చెత్త తెచ్చి అందులో పోశారు. అది నిండి 20రోజులు అవుతున్నా తరలించడం లేదు. దీంతో దుర్వాసన వస్తున్నదని స్థానికులు వాపోయారు. ఈ విషయమై 'నమస్తే తెలంగాణ'లో బుధవారం కథనం వెలువడింది. దీంతో స్పందించిన గ్రామపంచాయతీ సిబ్బంది గురువారం చెత్త ట్రాక్టర్‌ను అక్కడి నుంచి తరలించారు. తమ సమస్యను పరిష్కరించిన 'నమస్తే తెలంగాణ' దినపత్రికకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



నష్కల్‌లో చెత్త ట్రాక్టర్‌ను తరలిస్తున్న పంచాయతీ సిబ్బంది

# పకడ్బందీగా ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

- **జిల్లాలో హాజరుకానున్న విద్యార్థులు 3943మంది**
- **వివరాలు వెల్లడించిన కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా**

జనగామ చౌరస్తా, మే 15 : ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలను ఈ నెల 22నుంచి 28వ తేదీ వరకు జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. గురువారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ థియరీ పరీక్షలపై గూగుల్ మీట్ ద్వారా కలెక్టర్ రిజ్వాన్ బాషా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫస్టియర్ విద్యార్థులు 2383మంది, సెకండ్ ఇయర్ విద్యార్థులు 1560మంది మొత్తంగా 3943మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 10 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఫస్టియర్ విద్యార్థులకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సెకండ్ ఇయర్ విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు రెండు పూటలుగా పరీక్ష కొనసాగుతుందని సూచించారు. పరీక్షల నిర్వహణకు 10మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 10మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, ఒక అదనపు చీఫ్ సూపరింటెండెంట్, 1 కస్టోడియన్, 1 ఫ్లయ్యింగ్ స్క్వాడ్ బృందాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో నిర్దేశించిన మూడు రూట్ల ద్వారా ప్రశ్నపత్రాలను ఆయా పరీక్ష కేంద్రాలకు పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య చేర్చాలని ఆదేశించారు. ప్రతి పరీక్ష కేంద్రం లోపల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటి పని తీరును పరిశీలించాలని సూచించారు. పరీక్ష కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని కోరారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం టీజీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే దివ్యాంగ విద్యార్థులకు స్క్రైబ్ సౌకర్యాన్ని కల్పించాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ర్యాంపు కూడా సిద్ధం చేయాలని సూచించారు. హాల్ టికెట్ల కోసం విద్యార్థులు www. tsbie.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. విద్యార్థులకు ఇంకా ఏవైనా సందేహాలుంటే టెలీ మానస్ టోల్ ఫ్రీ నంబర్ 14416కు ఫోన్ చేసి సమస్యలను నివృత్తి చేసుకోవాలని తెలిపారు. సమావేశంలో డీఐఈవో జితేందర్‌రెడ్డి, వివిధ శాఖ అధికారులు, కలెక్టరేట్ ఏవో మన్సూరి పాల్గొన్నారు.



గూగుల్ మీట్ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా

## సీఎం గిరి వికాస్ పేరు మార్పు

**కొత్తగా ఇందిర సౌర గిరి జల వికాసం**

ఏటూరునాగారం, మే 15 : ఏజెన్సీలోని గిరిజన ప్రాంతాల్లో ఉన్న భూములకు సాగు నీటి సౌకర్యం కల్పించడం, భూములను చదును చేయడం, బోర్లు వేయించడం, మోటార్లు ఇవ్వడంతో పాటు విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సీఎం గిరి వికాస్ స్కీంను ప్రభుత్వం అమలు చేస్తున్నది. కాగా, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇటీవల ఈ స్కీం పేరును ఇందిర సౌర గిరి జల వికాసం స్కీంగా మార్చింది. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం గిరిజనుల భూముల అభివృద్ధి కోసం జిల్లాల వారీగా ఉన్న డీఆర్‌డీఏలకు నిధులను విడుదల చేసింది. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాకముందు ఈ పథకం ఇందిర జల ప్రభగా కొనసాగేది. దీనిని బీఆర్‌ఎస్ సీఎం గిరి వికాస్‌గా మార్చింది. ప్రస్తుతం కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందిర సౌర గిరి జల వికాసం గా మార్పు చేసింది. అయితే ఈ పథకం కింద ఇక నుంచి ఐటీడీఏలకు నిధులు విడుదల చేయనున్నట్లు సమాచారం. ఉమ్మడి వరంగల్ జిల్లాలో వెయ్యికి పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రెండేళ్లుగా ఈ పథకం కింద నిధులు విడుదల కావడం లేదు. దీంతో అనేక ప్రాంతాల్లో జరుగుతున్న భూమి అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

**కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశానికి**

## దరఖాస్తుల ఆహ్వానం

జనగామ చౌరస్తా, మే 15 : కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీహెచ్‌సీ విద్యార్థులకు ఇంటర్‌లో ప్రవేశం కల్పించడానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ జిల్లా అధికారి బీ విక్రమ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి 2025లో వెలువడిన పదో తరగతి ఫలితాల్లో 7.0 జీపీఏ లేదా మార్కులు 400కు పైగా వచ్చిన విద్యార్థులతోపాటు కేవలం ప్రభుత్వ పాఠశాలలు, జిల్లా పరిషత్ పాఠశాలలు, తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్స్, ఎయిడెడ్ స్కూల్స్, బెస్ట్ అవైలబుల్ స్కూల్స్, తెలంగాణ మాడల్ స్కూల్స్, కేజీబీవీలు, నవోదయ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులు మాత్రమే అర్హులవుతారని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు శనివారం (రేపటి) నుంచి ఈ నెల 31వ తేదీలోపు ఆన్‌లైన్ వెబ్‌సైట్ ఐడీ https//telanganaepass.cgg.gov.in ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. జూన్ 6వ తేదీన విద్యార్థుల సెలక్షన్ లిస్ట్ ప్రకటించనున్నట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల ధ్రువ పత్రాల పరిశీలన, కార్పొరేట్ కళాశాల అలాట్‌మెంట్ ఆర్డర్‌ను జూన్ 10వ తేదీన విద్యార్థులకు అందజేయనున్నట్లు తెలిపారు.

## ఒకేషనల్‌లో దరఖాస్తుల ఆహ్వానం

నర్మెట, మే 15 : మండల కేంద్రంలోని మాన్‌సింగ్‌తండాలో కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం అప్‌గ్రేడ్‌లో భాగంగా ఇంటర్మీడియట్ ఒకేషనల్ ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సును 2025-26 విద్యా సంవత్సరానికిగాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు స్పెషల్ ఆఫీసర్ రజిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేవలం 40పరిమిత సీట్లు మాత్రమే ఉన్నాయన్నారు. ఆసక్తి గల పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు బీ రజిత ప్రత్యేకాధికారి 994941246ను సంప్రదించాలని తెలిపారు.

## అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు

- **అర్హులకు న్యాయం చేయాలని ఎంపీడీవోకు బీజేపీ నాయకుల వినతి**
- **ఈ నెల 20న నిరాహార దీక్ష చేస్తామని వెల్లడి**

జఫర్‌గఢ్, మే 15 : మండలంలోని అన్ని గ్రామాల్లో అనర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం అన్యాయమని బీజేపీ నాయకులు అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు అర్హులకు మాత్రమే అందించాలని కోరుతూ గురువారం ఎంపీడీవో సుమన్‌కు వినతి పత్రం అం దించారు. అనంతరం బీజేపీ మండలాధ్యక్షుడు కోరుకొప్పుల నగేశ్ మాట్లాడుతూ మండలం లో ఇప్పటి వరకు మంజూరైన ఇందిరమ్మ ఇం డ్లు కేవలం కాంగ్రెస్ నాయకులకు మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ నాయకులకు, ఎమ్మెల్యే అనుచరులకు మాత్రమే ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని కాంగ్రెస్ నాయకులు హామీలు ఇవ్వడం దురదృష్టకరమని అన్నారు. ఎమ్మెల్యే అయినా, సీఎం అయినా ప్రజలందరికి ప్రతినిధులేనని, కేవలం కాంగ్రెస్ నాయకులకు మాత్రమే కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం ఆవాస్ యోజన పథకం నుంచి ఇందిరమ్మ ఇండ్లకు నిధులు మంజూరు చేస్తారని, కాంగ్రెస్ పార్టీ వారికి ఇండ్లు వస్తాయని అనడం వారి అవివేకమని నగేశ్ అన్నారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో అర్హులందరికీ అన్యాయం జరుగుతుందని, ఎంపీడీవో, ఇతర అధికారులు అర్హులకు మాత్రమే ఇండ్లు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని నగేశ్ కోరారు. అర్హులకు అన్యాయం జరిగితే బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో అన్ని గ్రామాల అర్హులైన లబ్ధిదారులను ఏకం చేసి ఈ నెల 20న నిరాహార దీక్ష చేస్తామని నగేశ్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ మైనార్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎండీ వలీపాషా, గీతాసెల్ జిల్లా కన్వీనర్ మేరుగు రామరాజు, మహిళా మోర్చా జిల్లా నాయకురాలు కవిత, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు ఇల్లందుల సారయ్య, బీజేవైఎం జిల్లా కార్యదర్శి పల్లె సంతోష్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సింగారపు రమేశ్, గాదారి సాయిరాం, నాయకులు పాల్గొన్నారు.



ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

## డిగ్రీలో ప్రవేశాలకు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ

స్టేషన్ ఘన్‌పూర్, మే 15 : జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ప్రవేశాల కోసం నేటి నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, ఇందుకోసం జీఆర్‌ఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ నర్సయ్య తెలిపారు. గురువారం దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ ఏర్పాటు చేసిన అనంతరం ఆయ న మీడియాతో మాట్లాడారు. ఈ విద్యా సంవత్సరంలో బీఏ, బీకాం, బీఎస్సీ లైఫ్ సైన్స్, బీఏ స్సీ ఫిజికల్ సైన్సెస్‌లో ఒక్కో గ్రూపులో 60సీ ట్లు ఉన్నట్లు తెలిపారు. డిగ్రీలో చేరే విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్‌లో ఉచితంగా పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దోస్త్ హెల్ప్ లైన్‌సెంటర్ నిర్వాహకులు జీ గోవర్ధన్, బీ సునీత, డీ సరోజ, గణేశ్, జగదీష్‌బాబు ఉన్నారు. వివరా ల కోసం దోస్త్ హెల్ప్ లైన్ సెంటర్ 9908 477894ను సంప్రదించాలని కోరారు.



స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్న ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ నర్సయ్య



రాఘవపురం-గూడూరు గ్రామాల మధ్య విరిగిన చెట్టును తొలగిస్తున్న పోలీసులు

## పాలకుర్తిలో జోరు వాన..

- **విరిగిన చెట్లు.. కూలిన విద్యుత్ స్తంభాలు**
- **అంధకారంలో గ్రామాలు**

పాలకుర్తి, మే 15 : మండలంలోని పలు గ్రామాల్లో గురువారం రాత్రి జోరు వాన కొట్టింది. సుమారు గంటపాటు వాన కురిసింది. గాలి దుమారానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు నేల కూలాయి. రాఘవపురం, గూడూరు గ్రామాల్లో చెట్లు విరగడంతో ఎస్సై దూలం పవన్ కుమార్ ఆధ్వర్యంలో సహాయక చర్యలు చేపట్టారు. జోరుగా కురిసిన వర్షానికి అన్నదాతలు ఆగమాగమయ్యారు. ధాన్యం తడిసింది. అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. దర్దేపల్లిలో విద్యుత్ స్తంభాలు విరగడంతో గ్రామంలో అంధకారం అలుముకుంది. దర్దేపల్లితోపాటు మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అంధకారం అలుముకుంది. చినుకు పడితే చీకటేనని గ్రామస్తులు వాపోతున్నారు. దర్దేపల్లి, గూడూరు, మల్లంపల్లి, వావిలాల, విస్నూరు, చెన్నూరు, తొర్రూరు జే గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యపు రాసులు తడవడంతో అన్నదాతలు బోరున విలపిస్తున్నారు. ధాన్యం మ్యాచర్ వచ్చి 20రోజులు గడుస్తున్నా కాంటాలు వేయలేదని, దీంతో వర్షానికి మళ్లీ ధాన్యం తడిసి ముద్దయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



అధునాతన ఫింగర్ ప్రింట్ పరికరాలను సిబ్బందికి అందజేస్తున్న సీపీ

## నేర పరిశోధనలో ఫింగర్ ప్రింట్ విభాగం కీలకం

**సీపీ సన్‌ప్రీత్ సింగ్**

సుబేదారి, మే 15 : నేరస్తులను పట్టుకోవడంలో ఫింగర్ ప్రింట్ విభాగం కీలకమని పోలీసు కమిషనర్ సన్‌ప్రీత్‌సింగ్ అన్నారు. రాష్ట్ర పోలీసు శాఖ వరంగల్ పోలీసు కమిషనరేట్ ఫింగర్ ప్రింట్ విభాగానికి మంజూరు చేసిన అధునాతన పరికరాలను బుధవారం హనుమకొండలోని సీపీ కార్యాలయంలో అధికారులకు సీపీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోనే తొలిసారిగా తెలంగాణ ఫింగర్ ప్రింట్ విభాగం నూతనంగా ఆటోమేటెడ్ మల్టీ మాడల్ ఫ్రింగర్ ప్రింట్ ఐడెంటిఫికేషన్ సిస్టం టెక్నాలజీని అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ టెక్నాలజీతో నేరాలకు పాల్పడిన వారి వేలి ముద్రలతో పాటు, కనురెప్పలు, ముఖం, పాదముద్రలను సేకరించిన తర్వాత సులువుగా నిందితులను పట్టుకోవచ్చన్నారు. నూతన టెక్నాలజీ పరికరాలను తొలుతగా కమిషనరేట్ పరిధిలోని తొమ్మిది పోలీస్ స్టేషన్లకు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫింగర్ ప్రింట్ ఇన్‌స్పెక్టర్ రాజ్‌కుమార్, శ్రీధర్, రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడిగా నర్సింగ రవి

లింగాలఘనపురం, మే 15 : మహజన సోషలిస్టు పార్టీ (ఎమ్మెస్పీ) మండల అధ్యక్షుడిగా మండలంలోని నెల్లుట్లకు చెందిన నర్సింగ రవిని నియమిస్తున్నట్లు జాతీయ పొలిట్‌బ్యూరో సభ్యుడు బొడ్డు దయాకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంగా గత ఐదేళ్లుగా మంద కృష్ణమాదిగ నాయకత్వంలో జాతిని చైతన్యం చేస్తూ ఉద్యమాన్ని ముందుకు నడిపిన వ్యక్తి రవి అని అన్నారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో తనవంతు పాత్ర పోషించారని అన్నారు. తను చేసిన కృషిని గుర్తించి మండల అధ్యక్ష పదవి అప్పగించడం మరింత బాధ్యత పెంచిందని రవి అన్నారు. తన నియామకానికి సహకారం అందించిన మంద కృష్ణమాదిగ, జాతీయ నాయకులు దయాకర్, కొయ్యడ మల్లేశ్, రాగల్ల ఉపేందర ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర్, ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి సందెన రవీందర్, నాయకులు మహేశ్, లాజర్, సోమరాజు, సురేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.



నర్సింగ రవి



జనగామ కోర్టు గుమస్తాల సంఘం నూతన కమిటీ బాధ్యులు

## కోర్టు గుమస్తాల సంఘం నూతన కమిటీ

జనగామ చౌరస్తా, మే 15 : జనగామ జిల్లా కోర్టు న్యాయవాదుల గుమస్తాల సంఘం నూతన కమిటీని ఎండీ ఖాజా పాషా ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బైరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా వల్లూరి నరేశ్, ప్రధాన కార్యదర్శి శాడ శ్రావణ్, కోశాధికారిగా మారబోయిన ఉపేందర్, కార్యదర్శిగా బత్తుల రాంబాబు, సభ్యులుగా తోకల రమేశ్, గూడపు అశోక్, రాపాక ఆంజనేయులును ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కమిటీ గౌరవ అధ్యక్షుడు పుస్కూరి రఘు, ఏదునూరి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపైకి వచ్చిన మురుగునీరు

## కంపు కొడుతున్న బీసీ కాలనీ

నర్మెట, మే 15 : మండల కేంద్రంలోని వెల్దండ గ్రామంలో రెండో వార్డులోని బీసీ కాలనీలో మురుగు నీరు నిండిపోయి డ్రైనేజీ పొంగి పొర్లుతుంది. కొన్ని నెలలుగా మురుగు నీరు రోడ్డు మీదకు వచ్చి పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా గ్రామ పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు. ఇదేమిటని అడిగితే సమాధానం చెప్పక దాటవేస్తున్నారని, మురుగు నీటి నిల్వతో తాము వ్యాధుల బారిన పడుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగు కాల్వలను శుభ్రం చేయాలని వారు కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

HOUSE FOR SALE

★Property for sale at Kishanpura near Chaitanya Degree College Hanamkonda, Warangal Urban Ground floor 2 BHK and 1 BHK with 2200 sq.ft, First & Second floor Slab laid 2200 sq.ft Each floor and Pent house 1030 sq.ft Slab laid Total square feets 7630. Per Sft. 4000/- negotiable Please Contact +91-7382963363. Location : 18°00'45.6"N 79°33'41.0" E (270 yards) STRICTLY NO BROKERS SERIOUS ENQUIRIES ONLY.

NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# విద్యార్థులకు స్టేషనరీ అందజేత




చౌడారం కేజీబీవీలో విద్యార్థులకు స్టేషనరీ అందజేస్తున్న గౌసియా భేగం

జనగామ రూరల్, మే 15 : మండలంలోని చౌడారం గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో వేసవి వసతి శిక్షణ శిబిరం నిర్వహిస్తుండటంతో విద్యార్థులకు అవసరమైన స్టేషనరీని గురువారం జీసీడీవో గౌసియా భేగం అందజేశారు. విద్యార్థులు స్పీడ్ మ్యాథ్స్ స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్ స్కిల్స్, ఒకేషనల్ ఆర్ట్‌అండ్‌క్రాఫ్ట్ యోగ గేమ్స్ సింగింగ్ డాన్సింగ్‌లలో 15రోజుల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులకు సమ్మర్ క్యాంపు స్టేషనరీ కిట్స్ అందజేశారు. ఈ కిట్లలో చార్ట్, క్రాఫ్ట్ పేపర్స్, వాటర్ కలర్స్ స్కెచెస్, పెన్ పెన్సిల్స్ మొదలైనవి సమ్మర్ క్యాంపులో వినియోగించుకోవడం కోసం అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి రాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



చిన్నరామన్‌చర్లలో మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ సర్పంచ్ బాపురెడ్డి

బచ్చన్నపేట, మే 15 : మండలంలోని చిన్నరామన్‌చర్లలో ఇటీవల మృతి చెందిన రామగల్ల కర్నేలు కుటుంబాన్ని గ్రామ మాజీ సర్పంచ్ పిన్నింటి బాపురెడ్డి పరామర్శించారు. గత ఆరు నెలలో ఒకే కుటుంబం నుంచి ముగ్గురు మృతి చెందడంపై ఆ కుటుంబం తీవ్ర విషాదంలో మునిగింది. విషయం తెలుసుకున్న బాపురెడ్డి బాధిత ఇంటికి వెళ్లి ప్రగాఢ సంతాపం తెలిపారు. 25కిలోల బియ్యం అందించారు. గ్రామానికి చెందిన న్యాయవాది నక్క సిద్దులు ఆ కుటుంబానికి తనవంతుగా రూ.వెయ్యి ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్గ సిద్ధులు, నూనెముంతల బాబు, రామగళ్ల రమేశ్, బ్రహ్మాచారి, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు గాదెపాక దినేశ్, గిల్లూరి సుధాకర్ పాల్గొన్నారు.

## 20న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

జనగామ చౌరస్తా, మే 15 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈ నెల 20వ తేదీన దేశ వ్యాప్తంగా చేపడుతున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే, ఏఐటీయూసీ జనగామ జిల్లా గౌరవ అధ్యక్షుడు సీహెచ్ రాజారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలోని కామ్రేడ్ నల్ల నర్సింహులు స్మారక హాల్‌లో సార్వత్రిక సమ్మె ప్రచార వాల్ పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాజారెడ్డి హాజరై మాటాడారు. కార్మికుల హక్కులను హరిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ తీసుకొచ్చిన నాలుగు కార్మిక వ్యతిరేక కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్పోరేట్ శక్తులకు అనుకూలంగా బీజేపీ కేంద్ర ప్రభుత్వం పనిచేస్తుందని విమర్శించారు. అనేక పోరాటాలతో కార్మికులు సాధించుకున్న 44చట్టాలను రద్దు చేసే కుట్రలకు పాల్పడుతున్న మోదీ ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ మే 20న కార్మికులు దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. సంఘటిత, అసంఘటిత రంగాల నుంచి సుమారు 10కోట్ల మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటున్నారని తెలిపారు. జిల్లాలోని హమాలీ, ఆటో, భవన నిర్మాణ, వృత్తి, శ్రమపై ఆధారపడి పనిచేసే కార్మికులంతా సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు చామకూర యాకూబ్, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సొప్పరి సోమయ్య, చెల్లోజు మల్లేశం, పట్టణ హమాలీ సంఘం అధ్యక్షుడు మోటె శ్రీశైలం, గుండెల్లి రాజు, భూమల్ల ఐలయ్య, బుడిగె వీరస్వామి, నగేశ్, యాకయ్య, నాగరాజు పాల్గొన్నారు.




సమ్మె ప్రచార వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీహెచ్ రాజారెడ్డి, నాయకులు



నదిలో పుణ్య స్నానాలు చేస్తున్న భక్తులు

## కాళేశ్వరంలో పుష్కర శోభ

- **మొదటిరోజు భక్తుల పుష్కర స్నానాలు**
- **ఆలయంలో ప్రత్యేక పూజలు**

మహదేవపూర్ (కాళేశ్వరం), మే 15: కాళేశ్వరం త్రివేణి సంగమం వేద మంత్రోచ్ఛారణలతో మారుమోగింది. దక్షిణాది రాష్ట్రాల్లోనే ఏకైక క్షేత్రం అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతీ సంగమంలో ఉదయం 5.44 నిమిషాలకు పుష్కరాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. గురువారం వేకువ జామునే త్రివేణి సంగమ తీరాన సరస్వతీ నదికి పుష్కరుడిని ఆహ్వానించే కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు సరస్వతీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి పుణ్యస్నానాలు ఆచరించారు. నది తీరం వద్ద భక్తులు పితృ తర్పణాలు, సంకల్ప పూజలు నిర్వహించారు. రోజుకు రెండు లక్షల మంది భక్తులు పుష్కరాలకు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేయగా, మొదటిరోజు భక్తుల రద్దీ మందకొడిగా ఉంది. సరిపడా సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బందులు పడాల్సిన దుస్థితి నెలకొంది. పుష్కరాలు ప్రారంభమైనప్పటికీ త్రివేణి సంగమం వద్ద ఇంకా పది రకాల పనులు కొనసాగుతుండడంపై భక్తులు అసంతృప్తి వ్యక్తం చేశారు.



పూజలు చేస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు దంపతులు



నదీ తీరంలో పితృ తర్పణాలు చేస్తున్న భక్తులు